



హైదరాబాద్ వార్త

# నగరంలో కుండపోత

**ఉరుములు, మెరుపులతో వడగండ్ల వాన ▼ మరో రెండు రోజులూ వర్షాలే**



హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త : నగర వ్యాప్తంగా శనివారం సాయంత్రం పెద్దఎత్తున వడగండ్ల వాన పడింది. నగర నడిబొడ్డున వడగండ్ల బీభత్సం భయాందోళనకు గురిచేసింది. వడగండ్లతో వాహనదారులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. ముఖ్యంగా బైక్స్‌పై వెళ్లేవాళ్లకు దెబ్బలు తలిలాయి. కొన్ని ప్రాంతాల్లో కార్లపై వడగండ్లు పడి అద్దాలు పగిలాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్ పరిసర ప్రాంతాల్లో వడగండ్ల వాన కురిసింది. ప్రధానంగా జూబ్లీహిల్స్, బంజారా హిల్స్, ఫిలింనగర్, షేక్‌పేట్, టోలిచౌకి, మోహిదీపట్నం, మణికొండ, నార్సింగ్, పటాన్‌చెరు, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కుసింది. బహదూర్‌పురా, ఫలక్‌నుమా, సికింద్రాబాద్, ప్యాట్నీ సెంటర్, బేగంపేట, అల్వాల్, చిలకలగూడ, తిరుమలగిరి, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, ఉస్మానియాయూనివరిసటీ, తార్నాక, హబ్సీగూడ, నాచారం, మల్లాపూర్, బోడుప్పల్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో వర్షం ధాటికి జనజీవనం నిలిచిపోయింది.

కొన్ని చోట్ల ఆకాశంలో మెరుపులు, మేఘాల గర్జనలకు జనం భయపడ్డారు. ఒక్కసారిగా కుండపోత వర్షం కురవడం, ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉత్తర-దక్షిణ ద్రోణి ప్రభావంతో అకాల వర్షాలు కురిశాయి. ఆదివారం, సోమవారాల్లో చాలా చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిసింది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవచ్చని అంచనావేసింది.

## దొంగ సారా దందా అంటూ మెట్రో పిల్లర్లపై కవిత పోస్టర్లు




బేగంపేట మార్చి 18,ప్రభాతవార్త : బేగంపేటలోని మెట్రో పిల్లర్లపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు వ్యతిరేకంగా పోస్టర్లు వేశారు గుర్తు తెలియని వ్యక్తులు. శనివారం ఉదయం ఈ పోస్టర్లు కనిపించాయి. రాత్రికి రాత్రి కొందరు వ్యక్తులు..ఈ పోస్టర్లు అంటించినట్లు కనిపిస్తుంది. అటుగా వెళుతున్న వారికంట్లో ఈ పోస్టర్లు పడ్డాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కవిత..ఈడీ విచారణను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే ఈ పోస్టర్లు బహిరంగంగా మెట్రో పిల్లర్లపై దర్శనం ఇవ్వటం కలకలం రేపుతోంది. పోస్టర్లలోని సారాంశాన్ని చూస్తే ఇలా ఉంది.."కవితక్క నీకు కావాలి సారా దందాలో 33శాతం వాటా..దాని కోసమే ఆడుతున్నవ్..33 శాతం మహిళా రిజర్వేషన్" అంటూ క్యాప్షన్స్ పెట్టారు. మరో పోస్టర్‌లో 'కవిత అంటే పద్యం అనుకుంటిరా..లే మద్యం' అంటూ టైటిల్స్ పెట్టారు. మరో పోస్టర్‌లో 'తెలంగాణ ప్రజల సొమ్ము దోచుకుని.. ఢిల్లీలో కవితక్క చేస్తుంది దొంగ సారా దందా.. కల్వకుంట్ల దొంగల ముఠా.. కథ స్క్రీన్ ప్లే మాటలు దర్శకత్వం కెసిఆర్' అంటూ టైటిల్స్ పెట్టి ఈ పోస్టర్లను ముద్రించడం జరిగింది. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీజీ కాలేజీ దగ్గరలోని మెట్రో పిల్లర్లకు ఈ పోస్టర్లు అంటించడం జరిగింది. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు.. ఆ పోస్టర్లను తొలగించారు. సీసీ కెమెరాలు పరిశీలించి.. సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు పోలీసులు.

# ముందస్తు చర్యలేల..?

**నిర్లక్ష్యమే.. నిప్పురాజేస్తోంది..!**

**షార్ట్‌సర్క్యూట్ జరగకుండా జాగ్రత్తలు అవసరం**

**గృహాలు, ఆఫీసుల్లో అదనపు లోడ్ పడకుండా చూసుకోవాలి**

**ప్రతియేటా విద్యుత్ తీగల తనిఖీ.. లైసెన్స్‌డ్ ఎలక్ట్రీషన్‌తో మరమ్మత్తులు చేయించాలి**

**ఐఎస్ఐ మార్కు విద్యుత్ తీగలు.. స్విచ్ బోర్డులనే వాడాలి**



హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త: ఈమధ్యకాలంలో ప్రతి ఇంట్లో, కార్యాలయంలో గృహోపకరాలు ఎక్కువైపోయాయి. అన్నీ ఉన్నాయంటే.. ఇక ఆఇళ్లలో కానీ, కార్యాలయాల్లోగానీ విద్యుత్ వాడకం కూడా ఎక్కువగానే ఉంటుంది. సాధారణంగా షార్ట్ సర్క్యూట్ గురించి వినిఉంటాం. మనం రోజు వాడే డివైజ్‌లల్లో ఆపరేటింగ్ కరెంట్ అనుకున్న యాంపియర్ల కంటే ఎక్కువ మించితేషార్ట్ సర్క్యూట్ అయ్యేవకాశం ఉంది. దీంతో పెను ప్రమాదాలు సంభవిస్తున్న సందర్భాలు ఉన్నాయి. అందుకే విద్యుత్ విషయంలో ఎలాంటి పొరపాటు చేయకూడదు. అలాగే మార్కెట్‌లో తక్కువ ధరలకు లభిస్తున్న ఏసీలు,కూలర్లు, ఫ్రిజ్‌లు ఇతర నాణ్యత లేని ఎలక్ట్రికల్ వస్తువులు వాడితే షార్ట్‌సర్క్యూట్ జరిగే ప్రమాదాలున్నాయని విద్యుత్‌రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ధర తక్కువగా ఉందని ఇళ్లలో ఇష్టానుసారంగా గృహోపకరణాలు వాడితే భారీ మూల్యం చెల్లించక తప్పదని వేసవిలో షార్ట్ సర్క్యూట్ జరిగేందుకు అవకాశాలు ఎక్కువ ఉంటాయని తెలుపుతున్నారు. లోడ్ ఎక్కువ పడుతుంది అనుకున్నప్పుడు ముందే జాగ్రత్తలు తీసుకుంటే విద్యుత్ ప్రమాదాలు నివారించవచ్చునని తనిఖీ అధికారులు సూచిస్తున్నారు. గృహాలు, ఆఫీసులల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. ముఖ్యంగా వేసవిలో వాణిజ్య కేంద్రాలు, దుకాణాలు, బహుళ అంతస్తులు, గోదాలులతోపాటు గృహాల్లో షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు అధికంగా జరుగుతుంటాయి. మాల్స్, వాణిజ్యసముదాయాల్లో రాత్రి మూసివేసేముందు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రతి సంవత్సరం గృహాలు, ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాల్లో విద్యుత్ వైరసింగ్ సిస్టమ్‌ను లైసెన్స్ తీసుకున్న టెక్నీషియన్లతో తనిఖీ చేయించుకోవాలని తెలుపుతున్నారు. నగరంలో చాలావరకు ఇళ్లలో ఏళ్లతరబడి విద్యుత్ తీగలు మార్చకుండా, స్విచ్‌బాక్సులు పాతవే వాడుతుండటంతో తీగలపై అదనపు లోడ్‌పడి విద్యుత్ తీగలు కాలిపోయే ప్రమాదం అధికంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

**లోడ్‌కు తగినట్లు వినియోగం ఉండాలి..** విద్యుత్ కనెక్షన్ ఉన్నచోట లోడ్ అనుమతి వరకే వినియోగించాలి. లోడ్ పెరిగితే విద్యుత్ తీగలు కాలిపోయే ప్రమాదం ఉంది. ఎండలో విద్యుత్ తీగలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండవేడికి తీగలపై ఉన్నరబ్బర్ మొత్తబడి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. గృహాలు, ఆఫీసుల్లో విద్యుత్ పనులను లైసెన్స్ పొందిన కాంట్రాక్టర్లతో చేయించుకోవాలి. తరుచూ తనిఖీలు నిర్వహిస్తుండాలి. ఎర్తింగ్ సమగ్రంగా ఉండేలా చూసుకోవాలి. ఏదైనా విద్యుత్ ఘాతమైతే ఎర్తింగ్ ఉండటం వల్ల ఎంసిబి ట్రిప్ అయి సరఫరా నిలిచిపోతుంది. విద్యుత్ వైరింగ్‌ను 4 చ.మిల్లీమీటర్ల మందం కలిగిన తీగలు ఇళ్లలో వినియోగించుకోవాలి. విద్యుత్ తీగలకు అతుకులు లేకుండా చూసుకోవాలి. అతుకుల తీగలతో లోడ్ పెరిగినప్పుడు స్పార్క్స్ వచ్చి ప్రమాదాలకు కారణమవుతాయి.

**వైరింగ్‌లో జాగ్రత్తలు తప్పనిసరి..** విద్యుత్ వైరింగ్ చేయించేటప్పుడు పూర్తిగా ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన ఎలక్ట్రానిక్ సామాగ్రి ఉపయోగించాలి. ఉదా: 10 యాంప్స్ విద్యుత్ ఉపయోగించే చోట 20 యాంప్స్ విద్యుత్ భారంపడే పరికరాలు వినియోగిస్తే తీగలు కాలిపోతాయి. నాసిరకం వల్ల విద్యుత్ వృధాఅవుతుంది. ఇన్సులేషన్ పటిష్టంగా ఉండేలా చూసుకోవాలి. ప్రతిఇంట్లో, చిన్న వాణిజ్య భవనాల్లో న్యూట్రల్ పరికరాల కోసం సరిపడినంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి. భూమిలోని తేమ, ఉష్ణోగ్రత ఎర్తింగ్ సిస్టమ్‌పై ఆధారపడుతోంది. ఎండకాలంలో రక్షణ పరికరాలు సరిగ్గా పనిచేయాలంటే ఎర్తింగ్ సరైన పద్ధతిలో ఉంచేందుకు నీరు ,దొడ్డు ఉప్పు వినియోగించాలి. గృహాలు, కార్యాలయాల్లో విద్యుత్‌వాడేందుకు మూడు పిన్నుల ప్లగ్‌లు, సాకెట్లు మాత్రమే ఉపయోగించాలి. ఒకస్విచ్‌బోర్డుకు ఎక్కువ ప్లగ్‌లు ఉపయోగిస్తే లోడ్ పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఇళ్లలో కొత్తగా విద్యుత్ ఉపకరణాలు పెట్టేందుకు అవసరమైన కనెక్టడ్ లోడ్ ఉందో లేదో చూసుకోవాలి. అందుకు తగినట్లు వైరింగ్ ఏర్పాటు తర్వాతే ఏసీలు, వాటర్ హీటర్స్ ,మైక్రో ఓవెన్ ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించుకోవాలి. విద్యుత్ స్థంబాల నుంచి మీటర్ వరకు ఉండే సర్వీస్‌వైర్లను రెండు సంవత్సరాలకు ఒకసారి మార్చుకోవాలి. సింగిల్ ఫేజ్ సర్క్యూట్‌లో ఫేజ్, న్యూట్రన్, ఎర్త్, వైర్లు సమానపరిణామంలో ఉండేలా చూసుకోవాలి. రక్షణ పరికరాలైన ఎంసిబి (మైక్రో సర్క్యూట్ బ్రేకర్) ఎంసిసిబి (కరెంట్ కంట్రోలర్ బ్రేకర్) ఫ్యూజులు బైపాస్ చేయకూడదు. లైటింగ్ సర్క్యూట్ కొరకు 30మిల్లీ యాంప్స్ ఈఎల్‌సిబి, ఆర్‌సిసిబి పవర్ సర్క్యూట్‌లో 100మిల్లీ యాంప్స్ ఈఎల్‌సిబి, ఆర్‌సిసిబి వినియోగించాలి.



నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటి రాఖీసింగ్

## 17 లక్షల హవాలా డబ్బు సీజ్.. ఇద్దరి అరెస్టు

హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త : నగరంలో భారీగా హవాలా డబ్బును సీజ్ చేశారు పోలీసులు. విశ్వసనీయ సమాచారం మేరకు కాచిగూడ రైల్వే స్టేషన్ రోడ్‌లో వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు..ఓ వ్యక్తి వద్ద రూ.17లక్షల హవాలా డబ్బును గుర్తించారు. నగరంలోని బడిచౌడి ప్రాంతానికి చెందిన హరి నారాయణ కొట్టారి అనే వ్యక్తి రూ.17లక్షల అక్రమ నగదు కాటేదాన్ ప్రాంతానికి చెందిన షోహెల్ అనే వ్యక్తుల మధ్య చేతులు మారుతుండగా గుర్తించిన పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసులు నగదును సీజ్ చేసి ఐటీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని..ఈ డబ్బు ఎవరికి చెందినదని..దీని వెనుకాల ఎవరు ఉన్నారని ఆరా తీస్తున్నారు. కేసు నమోదు చేసి నిందితులను కాచిగూడ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

## కూకట్‌పల్లిలో భారీ వర్షం

**వడగళ్లతో కూడిన వర్షానికి ప్రజల ఇక్కట్లు**



నీటిలో నడుచుకుంటూ వెళ్తున్న స్థానికులు

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 18, ప్రభాతవార్త : కూకట్‌పల్లిలో శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం సుమారు 5గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం రావడంతో లోతట్టు ప్రాంతాలన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. కూకట్‌పల్లిలోని కెపిహెచ్‌బి కాలనీ వివేకానంద నగర్ కాలనీ ముసాపేట బాలానగర్ హైదర్‌నగర్ వసంతనగర్ తదితర ప్రాంతాలలో వడగళ్ళ వాన కురిసింది. ఇక్కడి పరిసర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షం పడడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. కూకట్‌పల్లి వివేకానందనగర్ కాలనీ మాధవరం కాలనీ తదితర ప్రాంతాలలో ఈదురు గాలులకు కొన్ని ప్రాంతాల్లో చెట్లు పడిపోయాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## పురస్కారాలు పొందిన వారు మరింతగా సేవలు అందించాలి



సైఫాబాద్, మార్చి 18 ప్రభాతవార్త: పురస్కారాలు మరింతగా సేవలు అందించేందుకు దోహదపడతాయని టిఎస్ఐడిసి ఛైర్మన్ సముద్రాల వేణుగోపాలాచారి, రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ వి.కృష్ణమోహనరావు చెప్పారు. పురస్కారాలు అందుకున్నవారు మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని ప్రముఖులతో మళ్ళీ పురస్కారాలు పొందాలని వారు సూచించారు. శ్రీసాయి అలేఖ్య సాంస్కృతిక సంఘ సేవ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శోభకృత్ నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఉగాది రాష్ట్ర స్థాయి బాల పురస్కారాలు, ఉపాధ్యాయ గురుపురస్కారాలు, అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు, చాకలి ఐలమ్మ స్త్రీశక్తి పురస్కారాల సభ శనివారం రవీంద్రభారతిలో జరిగింది.

## జిహెచ్ఎంసి స్వీపింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి

**ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్**




మహాసభలో ప్రసంగిస్తున్న ఎం.డి.యూసఫ్, ఎం.నర్సింహా

సైఫాబాద్, మార్చి 18 ప్రభాతవార్త: జిహెచ్ఎంసి పరిధిలో పనిచేస్తున్న స్వీపింగ్, మలేరియా తదితర విభాగాల్లో పనిచేస్తున్న 30 వేల మందికిపైగా సంవత్సరాల తరబడి పనిచేస్తున్న కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 11వ పిఆర్‌సి సందర్భంగా రాష్ట్రంలోని కార్మికులందరికి 30 శాతం వేతనాలు పెంచి నప్పటికి జిహెచ్ఎంసిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మాత్రం వేతనాలు పెంచకపోవడం అన్యాయమని వీరికి సమాన పనికి సమానవేతనం చట్ట ప్రకారం 26 వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిహెచ్ఎంసి కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ద్వితీయ మహాసభ శనివారం సత్యనారయణరెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సభకు ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎం.డి.యూసఫ్ మాట్లాడుతూ జిహెచ్ఎంసిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి, జిహెచ్ఎంసికి ఆనేక అవార్డులు రావడం జరిగిందన్నారు. జిహెచ్ఎంసి ఆదాయాన్ని సైతం కాంట్రాక్టు కార్మికుల పనిద్వారా లభించడం జరిగిందని, జిహెచ్ఎంసిలో సరిపడ డబ్బులు ఉన్నప్పటికి కార్మికులకు సరిపడ వేతనాలు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వంకు మనసురాకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైన కార్మికులను క్రమబద్ధీకరించాలని, ఇతర సమస్యలను పరిష్కారించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిహెచ్ఎంసి కార్యా లయం ఎదుట ఎద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవం ఎన్నుకోవడం జరిగింది. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఎం.డి.యూసఫ్, అధ్యక్షుడిగా ఎం.నర్సింహా, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బోడ్డుపల్లి కిషన్, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకటయ్య, ఉప ప్రధాన కార్యదర్శిగా నర్సయ్య తదితరులు ఎన్నికైనారు.

## విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు త్వరలో పరిష్కారం

**టి.ఎస్.జన్‌కో, ట్రాన్స్‌కో సిఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావు**




జిటియస్ కాలనీలో రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ 1535 యూనియన్ సిల్వర్‌జూబ్లి వేడుకల్లో, కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండీ ప్రభాకర్‌రావు

యూసుఫ్‌గూడ, మార్చి 18, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పి.ఆర్.సితో పాటు ఇ.పి.ఎఫ్, జి.పి.ఎఫ్ ఆర్జీజన్‌లను కన్వర్షన్ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందని అతిత్వరలోనే సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కానున్నాయని టి.ఎస్.జన్‌కో, ట్రాన్స్‌కో సిఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర పవర్‌ఎంప్లాయిస్ యూనియన్ (1535) 25 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా వెంగళరావునగర్ జిటిఎస్ కాలనీలో నూతనంగా నిర్మించిన యూనియన్ భవనం ప్రారంభోత్సవంతో పాటు సిల్వర్‌జూబ్లి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలకు ముఖ్యఅతిధులుగా సిఎమ్‌డి ప్రభాకర్‌రావు, టి.ఎస్.ఎన్.పి.డి.సి.ఎల్ సిఎండీ జి రఘుమారెడ్డిలు యూనియన్ నూతన భవనం ప్రారంభించి సిల్వర్ జూబ్లి వేడుకల్లో పాల్గొన్నారు. విద్యుత్ సంస్థల్లో కష్టపడి పనిచేసిన సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సిఎండి రఘుమారెడ్డి తెలిపారు. గత అనుభవాలను గుర్తుచేస్తూ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులందరికి గుర్తింపుగా మెడల్స్, జ్ఞాపికలను టిఎస్‌జెన్‌కో మాజీ డైరెక్టర్ వామనరావు అందజేశారు. ఈకార్యక్రమంలో టిఎస్‌పిఇయు 1535 సెంట్రల్‌కమిటి అధ్యక్షులు కార్యదర్శులు ఎం.ఏ వజీర్, డి.రాధకృష్ణ, ఎన్‌కో అధ్యక్ష కార్యర్శులు రాము,కుమారస్వామి, ట్రాన్స్‌కో అధ్యక్ష కార్యదర్శులు బి.నగేష్, కె.రవి, ఎన్‌పిడిసిఎల్ అధ్యక్ష కార్యదర్శులు మూర్తి శ్రీనువాస్, ఎస్‌పిడిసిఎల్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌కె కౌసర్‌పాషా, కె.సురేందర్, డిప్లమా అసోసియేషన్ నాయకులు సతీష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్‌మణి, విజయ్‌కుమార్, ఎమ్ శ్రీధర్,ఎమ్‌డి గౌసుద్దీన్, అంబాల శ్రీనివాస్, ఎమ్‌డి అప్జల్, అబ్దుల్ తఖీ, ఎస్ లవకుమార్, వి ధనయ్య, ఎస్‌కె మూస్తన్ రజా, రాష్ట్ర రీజనల్ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బిజెపి ధర్నా

గన్‌ఫౌండ్రి, మార్చి 18 ప్రభాతవార్త: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ పేపర్‌లీకేజీతో విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలలో తెలంగాణ ప్రభుత్వం ఆటలాడుతుందని తెలంగాణ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు.విద్యార్థులు, నిరుద్యోగల పక్షాన బిజెపి ఆద్వర్యంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీగా వస్తున్న బిజెపి నాయకులు చింతల రామచంద్రారెడ్డి, జిహెచ్ఎంసి ఫ్లోర్‌లీడర్ గొంటిశంకర్‌యాదవ్, బిజెపి జిల్లాల అధ్యక్షులు వి.పాండుయాదవ్, గౌతం రావు, శ్యామ్ సుందర్‌లతోపాటు మరో30మంది బిజెపి నాయకులు,కార్యకర్తలను అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు,నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాలపై హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించేందుకు వచ్చిన బిజెపి నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయమని, అప్రజాస్వామికమన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల జీవితాలతో ఆటలాడుతుందన్నారు. నిరుద్యోగులు ఎంతో ఆశతో పోటి పరీక్షలకు సిద్ధమవుతుండగా, పబ్లిక్ సర్వీసెస్ కమీషన్ పేపర్ లీక్ కావడం పట్ల భాద్యతరహితంగా వ్యవహారించారని దుయ్యబట్టారు. అందుకు బిజెపి నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అబిడ్స్ పోలీసులు రంగప్రవేశం చేసి వారిని అరెస్ట్ చేశారు. పోలీసులకు, బిజెపి నాయకులకు తోపులాట జరిగింది.

## మే నాటికి మనబస్తీ బడి పనులను పూర్తి చేయాలి

**అధికారులకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశం**



సమీక్షా సమావేశంలో పాల్గొన్న మంత్రి తలసాని, మహమూద్ అలీ

హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త: మేనాటికి మన బస్తీ బడి పనులను పూర్తి చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ లో మనబస్తీ, మనబడి కార్యక్రమం కింద మొటివిడతలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులపై మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈసమావేశంలో హోంమంత్రి మహమూద్‌అలీ, ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీ సురభివాణిదేవి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరు వెంకటేష్, మేయర్ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలతరెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ దేవసేన, జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్, జిహెచ్ఎంసి కమిషనర్ లోకేష్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అదికారి రోహిణి తదితరల శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అన్నిరకాల సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించడం ద్వారా విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన జరగాలనేది సిఎం కెసిఆర్ లక్ష్యమని ఆయన ఆలోచనలో నుంచి పుట్టిందే మనబస్తీ మనబడి కార్యక్రమం అని పేర్కొన్నారు. ఈకార్యక్రమం అమలు కోసం రాష్ట్రంలో 26,065 పాఠశాలల్లో అభివృద్ధి పనులకోసం 7,289 కోట్ల రూపాయలను మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో మొదటివిడతలో 35శాతంగా 9,123 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించి ఇందుకుగానూ 3,497 కోట్ల రూపా యలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ కార్య క్రమం కింద ఆయా పాఠశాలల్లో ప్రహారీగోడ నిర్మాణం, భవనాలకు పెయింటింగ్, విద్యుత్ సౌకర్యం, త్రాగునీటి సరఫరా, టాయిలెట్స్ నిర్మాణం, ఫర్నిచర్ ఏర్పాటు, గ్రీన్‌చాక్‌బోర్డు ఏర్పాటు వంటిపనులను చేపడుతున్నట్లు వివరించారు. హైదరాబాద్ జిల్లాలోని 15నియోజకవ ర్గాల పరిధిలో 690పాఠశాలలు ఉండగా, మొదటి విడతలో 239, పాఠశాలలను అభివృద్ధి పనులను చేపట్టేందుకు గుర్తించి 44కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వీటిలో వివిధ కారణాలతో 198పాఠశాలల్లో మాత్ర మే పనులను చేపట్టినట్లు వివరించారు. ఈపనులను కూడా ప్రభుత్వ రంగసంస్థలైన జిహెచ్ఎంసి, టిఎస్ఎం ఐడిసి వంటి సంస్థల ఆధ్వర్యంలో జరిగిందని తెలి పారు. ఇప్పటి వరకు జరిగిన పనుల పరోగతిపై ఆయాన సంస్థల వారిగా మంత్రి సమీక్షించారు. విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను మరింత వేగవంతం చేసి మేనాటికి పూర్తి చేసేవిధంగా కార్యాచరణను రూపొందించుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

## కార్వాన్‌లో టిడిపి నేతల సంబరాలు



గుడిమల్కాపూర్‌లో నిర్వహించిన సంబరాల్లో పాల్గొన్న బండారి వెంకటేష్

మెహిదీపట్నం, మార్చి 18, ప్రభాతవార్త: కార్వాన్ నియోజక వర్గంలో టిడిపి నేతలు సంబరాలు జరుపుకున్నారు. ఏపీ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుపొందడంతో శనివారం గుడిమల్కాపూర్‌లోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద ఆపార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్ చార్జి బండారి వెంకటేష్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండారి వెంకటేష్, రాష్ట్ర అధికార ప్రతినిధి బుగిడి అనుప్‌కుమార్‌లు మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అందుకే విద్యావంతులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించారన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సంబరాల్లో టిడిపి నాయకులు సురేందర్‌సింగ్, నర్సింగ్‌రావు, చంద్రకాంత్, దేవేందర్, ఖైరుద్దీన్, శ్రీను, ఉమేష్, రాకేష్ గౌడ్, క్రిష్టోఫర్, నవీన్, రవిచారి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రశ్నాపత్రాల లీకేజీతో టిఎస్‌పిఎస్సీ విశ్వసనీయత కోల్పోయింది



సమావేశంలో మాట్లాడుతున్న భూపేష్‌సాగర్, రాజ్‌కుమార్

హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త: టిఎస్‌పిఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విశ్వసనీయత కోల్పోయి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని గ్రేటర్ హైదరాబాద్ బిసిసంక్షేమసంఘం అధ్యక్షులు భూపేష్‌సాగర్ అన్నారు. ఈమేరకు శనివారం విద్యానగర్‌లో జరిగిన సమావేశంలో రాష్ట్రకన్వీనర్ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నందగోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాండ్ల రమేష్ పటేల్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా భూపేష్‌సాగర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేసినప్పటి నుంచి నిరుద్యోగులు, విద్యార్థులు పోటీపరీక్షలకు సన్నదమవుతున్న నేపథ్యంలో టిఎస్‌పిఎస్సీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రశ్నాపత్రాల లీకేజీ అవడం నిరుద్యోగులను విద్యార్థులను వారి తల్లిదండ్రులను కలవరపెడుతుందన్నారు. ఉన్నత చదువులు చదివిన విద్యార్థులకు నిరాశే ఎదురైందన్నారు. డిగ్రీ, పిజి, బిటెక్,ఎంటెక్‌లు చదివి ఉద్యోగాల కోసం సంవత్సరాల కొద్ది ఇంటికి దూరంగా ఉంటూ కోచింగ్ సెంటర్‌లో లక్షల ఫీజుల కట్టి ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న సందర్భంలో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి ప్రశ్నాపత్రాల లీకేజీ అధికారులను కఠినంగా శిక్షించాలని లేనిపక్షంలో ఈనెల 21టిఎస్‌పిఎస్సీ కార్యాలయం ముట్టడిస్తామని భూపేష్‌సాగర్ హెచ్చరించారు.

# 26 నుంచి రసరంజని నాటకోత్సవాలు ప్రారంభం



రసరంజని ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న డా.కె.వి.రమణాచారి

సైఫాబాద్, మార్చి 18 (ప్రభాతవార్త): తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 'రసరంజని నాటకోత్సవాలు' ఈ నెల 26, 27, 28 తేదీలలో రవీంద్రభారతిలోని ప్రధాన వేదికపైన జరుగుతాయని రసరంజని అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి తెలిపారు. తెలుగు నాటక రంగ వికాసానికి వైభవానికి దోహదపడాలని తెలుగు నాటక ప్రేక్షకులు టిక్కెట్ ఖరీదు చేసి ప్రదర్శనను తిలకించేలా అలవాటు చేయాలనే లక్ష్యంతో 1993లో మార్చినెలలో రసరంజని సంస్థను నాటక ప్రియులు, రంగస్థల ప్రముఖులు ప్రారంభించారని చెప్పారు. మూడు దశాబ్దాలపాటు నిరాటంకంగా ప్రేక్షకుల ఆదరణతో రసరంజని సంస్థ ముందుకు కొనసాగుతున్నదని చెప్పారు. శనివారం మాసాబ్‌ట్యాంక్‌లోని రమణాచారి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మూడు రోజులపాటు 26న 'సిరి మింగిన వెలగ పండు' నాటకం ప్రదర్శన, 27న 'ది ఇంపోస్టర్స్' నాటకం, 28వ తేదీన 'పెట్రోమాక్స్' పంచాయితీ నాటకం ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ నాటకాల ప్రారంభ సభకు రసరంజని వ్యవస్థాపక అధ్యక్షుడు హెచ్.జె.దొర, అక్కినేని నాటక పరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు పాల్గొంటారని, 27వ తేదీన జరిగే సభలో రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ ఛైర్మన్ దీపికారెడ్డి, విశిష్ట అతిధులుగా దుగ్గిరాల సోమేశ్వర్‌రావు, మామిడి హరికృష్ణ, తనికెళ్ల భరణి, కోట్ల హనుమంతరావు తదితరులు పాల్గొంటారని రమణాచారి వివరించారు. అలాగే సభలో రంగస్థల ప్రముఖులు డా.బి.ఎం.రెడ్డిని, మేకప్ కళాకారుడు మల్లాది గోపాలకృష్ణను, నటుడు జెన్నిని పదివేల రూపాయల నగదు బహుకరించి ఘనంగా సత్కరిస్తామన్నారు. అలాగే యువ రంగస్థల పురస్కారంకు శివరామిరెడ్డిని ఎంపిక చేశామని, ఆయనకు 25 వేల రూపాయల నగదు పురస్కారం అందజేస్తామని తెలిపారు. ఈ మావేశంలో రసరంజని ప్రతినిధులు దుగ్గిరాల సోమేశ్వర్‌రావు, మోహన్‌సేనాపతి, నటరాజ్, నారాయణస్వామి, అరుణ్, కామేశ్వర్‌శర్మ, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్‌లో యాప్‌లు డౌన్‌లోడ్ చేయించి డబ్బులు కాజేస్తున్న ఇద్దరు నేరస్థుల అరెస్టు

హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త : సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు మోస్ట్ వాంటెడ్ నేరస్థులు హైదరాబాద్ పోలీసులకు చిక్కారు.శనివారం చందానగర్ పోలీసులు ఇద్దరు సైబర్ నేరస్థులను అరెస్టు చేశారు. నిందితుల నుండి 10 లక్షల విలువైన 3 లాప్‌టాప్‌లు, 15 మొబైల్స్, ఒక యమహా బైక్, లక్షా నలభైవేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాదాపూర్ డిసిపి శిల్పవల్లి తెలిపిన వివరాల ప్రకారం. "ఇద్దరు సైబర్ నేరస్థులను అరెస్ట్ చేశాం. దేశవ్యాప్తంగా ఈ ఇద్దరిపై 41 కేసులు నమోదైయ్యాయి. ఎనీడెస్క్ వంటి పలు యాప్‌లు ఫోన్‌లో డౌన్ లోడ్ చేయించి భారీ డబ్బును కాజేస్తున్నారు. ఫోన్ల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని డిసిపి చెప్పారు. పట్టుబడిన నేరస్థులు ఎ1 నాగ ప్రేమ్ అమోజాన్ సేల్స్‌లో పని చేస్తున్నాడు. ఎ2 బనావత్‌కుమార్ అమోజాన్ ప్యాకింగ్ లో పనిచేస్తున్నాడు. నిందితులు నల్గొండకు చెందిన వారు. జార్ఖండ్‌కు చెందిన ఎ3 రాహుల్ పరారీలో ఉన్నాడు. అయితే ఎ3తో కలిసి వారు సైబర్ క్రైమ్ చేయడం మొదలు పెట్టారు. నాగప్రేమ్, బనావత్‌కుమార్‌లు జార్ఖండ్ గ్యాంగ్‌తో కలిసి ఇప్పటి వరకు 1800 సైబర్ క్రైమ్‌లు చేశారు.అయితే కొంత కాలం తర్వాత ఎ1, ఎ2 ఇద్దరు కలిసి సొంతంగా నేరాలకు పాల్పడుతున్నారు. ఇటీవల ఓ వృద్ధురాలి బ్యాంకు నుండి డబ్బు కొట్టేశారు. ఆ వృద్ధురాలు రెండు రోజుల క్రితం ఒక కొత్త సీమ్‌కార్డు కొనుగోలు చేసింది. ఇది గమనించిన నేరస్థులు..ఆమె ఫోన్‌కు ఒక మెసెజ్ పంపించారు. ఆమె వెంటనే ఆ నెంబర్‌కు కాల్ చేసింది. మీ సిమ్ యాక్టివేట్ చేయాలని చెప్పి ఆ వృద్ధురాలి ఫోన్‌లో ఎనీ డెస్క్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొమని చెప్పారు. తర్వాత ఓటీపి నెంబర్ వస్తుంది చెప్పమని అడిగారు. ఆమె నెంబర్ చెప్పడంతో తన బ్యాంకు నుండి రూ.లక్షా ముప్పై వేలు కొట్టేశారు. మోసపోయానని తెలుసుకున్న ఆ మహిళ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను పట్టుకున్నారు. అవగాహన లేకపోవడం, అత్యాశ కారణంగా సైబర్ క్రైమ్ పెరుగుతోంది' అని డిసిపి తెలిపారు.

## పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ చేసిన ఆర్.ఆర్.ఫౌండేషన్



మణికొండ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేసిన చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డి ఫౌండేషన్ ప్రతినిధులు

నార్సింగి, మార్చి 18 ప్రభాతవార్త : చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డి(ఆర్.ఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా "పరీక్షా ప్యాడ్"లను పంపిణీ చేశారు. నార్సింగి వ ఌ ని స్ల ఎ ౕ ల ౕ చైర్ పర్సన్ దారుగుపల్లి రేఖ యాదగిరి, మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డిలు, స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలిసి వందలాది మంది విద్యార్థులకు ప్యాడ్‌లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రేఖ, రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ సేవ చేయడంలో కలిగే సంతృప్తి ఏ పనిలో కూడా లభించదన్నారు. స్వతహాగా బడా వ్యాపారవేత్త, ఎంపి రంజిత్‌రెడ్డి తన ఫౌండేషన్ ద్వారా సర్కారు బడుల్లో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు తనవంతు చేయూతనిస్తుండడం గర్వంగా ఉందన్నారు. విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్‌లు కూడా ఇచ్చి తమవంతు సహాయం చేస్తున్నారన్నారు. సమాజంలో ఆర్థికంగా స్థిరపడ్డ వారు తమకు తోచిన రీతిలో మన చుట్టూ ఉన్న వారి ఎదుగుదలకు సహకారం అందించాలని ఎంపి తను ఆచరించి, మనందరికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. తీసుకోవడంలో కన్నా ఇవ్వడంలోనే ఆనందం, సంతోషం, తృప్తి మిగులుతాయన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శానిటరీ ప్యాడ్‌లు, పరీక్షా ప్యాడ్‌లు, నోటు పుస్తకాలు పంపిణీ చేసి తనవంతు చేయూతనిచ్చేందుకు ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటిహాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

దుండిగల్, మార్చి 18 ప్రభాతవార్త : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేటలో రూ,30లక్షల నిధు లతో నూతనంగా నిర్మించనున్న ముదిరాజ్ సంఘం మల్టీపర్పస్ కమ్యూ నిటిహాల్ నిర్మాణ పను లకు ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికిఒ బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదప్రజల శుభకార్యాలకు ఉపయోగపడేలా చేపడుతున్న కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు భూమిపూజ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బుచ్చిరెడినడ, సుదర్శన్‌రెడ్డి, మురళియాదవ్, విష్ణువర్థన్‌రెడ్డి, స్వామిముదిరాజ్, పెంటయ్యముదిరాజ్, మధుసూదన్‌ముదిరాజ్, శంభీపూర్ బాగయ్యముదిరాజ్, మన్నెబాల్‌రాజ్‌ముదిరాజ్, మన్నె శేఖర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నా పత్రాల లీకేజిపై
## సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలి

సైఫాబాద్, మార్చి 18 ప్రభాతవార్త: రాష్ట్రంలో టిఎస్‌పిఎస్సీలో ప్రశ్నాపత్రాల లీకేజీపై తక్షణమే సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లీకేజీలకు బాధులైన వారిపై క్రిమినల్ కేసులు బుక్‌చేసి వెంటనే ఉద్యోగాల నుంచి తొలగించాలని కోరారు. ప్రశ్నా పత్రాలు లీకేజీ చేసిన దొంగల వల్ల లక్షలాది మంది నిరుద్యోగ యువత తీవ్ర నిరాశనిస్పృహలకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## మెరుగైన వైద్యానికి సిఎం రిలీఫ్ ఫండ్‌ఎంతో మేలు : నివేదిత



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సాయన్న కూతుర్లు లాస్య నందిత, నివేదిత, టీ.ఎన్. తేజ్‌పాల్ తదితరులు

అడ్డగుట్ట, మార్చి 18 ప్రభాతవార్త: పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతగానో ఉపయోగపడుతుందని, కంటోన్మెంట్ ఎమ్మెల్యే దివంగత జి.సాయన్న కూతుర్లు నివేదిత, లాస్య నందితలు తెలిపారు. 7వ వార్డు న్యూ గాంధీ నగర్‌కు చెందిన ఆంథోని నెల్సన్‌కు మెరుగైన వైద్యం కోసం మంజూరైన 60 వేల చెక్కును శనివారం వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్. శ్రీనివాస్, 7వ వారుడ బిఆర్ఎస్ అధ్యక్షుడు తేజ్‌పాల్, బిఆర్ఎస్ నేతలు సదానంద్ గౌడ్, నిత్యానంద్ పాల్గొన్నారు.

## సిమెంట్ బల్లలతో కుర్చీల ఏర్పాటు



సిమెంట్ కుర్చీలు అందచేస్తున్న టిఎన్‌జిఓ అధ్యక్షులు ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ

గన్‌ఫౌండ్రి,మార్చి 18ప్రభాతవార్త: దోమలగూడ భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ స్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం సిమెంట్ బల్లలను తెలంగాణ నాన్‌గజిటెడ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ అందచేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో మైదానంలో కూర్చోవడానికి కష్టంగా ఉందని తెలియయడంతోనే వెంటనే ఐదు సిమెంట్ కుర్చీలు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు.విద్యార్థులు భవిష్యత్తులో అన్ని రంగాలల్లో ముందుకు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్ కుమార్,సభ్యులు వైదిక్‌శాస్త్రి,బి.శంకర్,ముఖీ మ్ఖురేషీ, మహమ్మద్‌ముస్తాఫా,మహమ్మద్ వహిద్ పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి : ఎస్ఐ లక్ష్మీ



చార్మినార్, మార్చి 18 ప్రభాతవార్త : సైబర్ నేరాలు పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని కామాటిపుర పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి అన్నారు.దూద్‌బౌలిలోని అశ్రిత్ హోంలో శనివారం జరిగిన కార్య క్రమంలో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకుంటే తప్పకుండ ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్రిత్ కమ్యూనిటీ కేర్ కో ఆర్డినేటర్ వి.పర్వతాలు, కామాటిపుర ఎఎస్ఐ ధర్మేంద్ర అశ్రిత టి.సభ్యులు అనిత, నాగమణి, సుజాత, నరసమ్మతో పాటు పలువురు పాల్గొన్నారు. 30మందికి నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు.

## అగ్నిప్రమాద మృతుల కుటుంబాలకు రూ.50లక్షల నష్టపరిహారాన్ని అందించాలి



మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నాలో యువజనకాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్ యాదవ్, కవిత

హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త: స్వప్నలోక్ కాంప్లెక్ మంటల్లో అసువులుబాసిన మృతుల కుటఉంబాలకు రూ.50లక్షల నష్టపరిహారాన్ని అందించాలని యువజన కాంగ్రెస్ జాతీయప్రధాన కార్యదర్శి ఎం.అనీల్ కుమార్‌యాదవ్, సికింద్రాబాద్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కవిత డిమాండ్‌చేశారు. మహిళా కాంగ్రెస్ సికింద్రాబాద్ అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రమాదేవి, కృష్ణారెడ్డి, అనీత, జిలానిలతో కలిసి మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం ఆందోళన చేపట్టారు. మృతి చెందిన ఆరుగురిలో నలుగురు మహిళలు కావడం వారందరూ కూడా 23సంవత్సరాలోపు ఉడడం చాలా బాధాకరమని అన్నారు. మృతి చెందిన వారందరు రెండున్నర లక్షలు వెచ్చించి ఉద్యోగంలో చేరారని పేర్కొన్నారు. టిఆర్ఎస్ పార్టీ నుంచి రూ.3లక్షలు ఇస్తామనడం మంచిది కాదని, ఒక్కో కుటుంబానికి రూ.50లక్షలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలో తరచుగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు అఖిల, సుజాత, కృష్ణవేణి, వినోద, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కారిస్తాను

**ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**



స్థానికులతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు

హైదరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త: కాచిగూడ డివిజన్‌లోని రాజేంద్ర కాలనీలో అంబర్‌పేట నియోజక వర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శనివారం స్థానిక ప్రజలతో కలిసి పర్యటించారు. స్థానికులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు రాము, తిరుపతి, కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, కాలనీవాసులు వెంకటేష్, ఆదిత్య, ఘోస్, దతా త్రేయ, విఘ్నేష్, నవీన్, నిశాంత్, ప్రణవ్ పాల్గొన్నారు.

## శ్రీరంగం ఫౌండేషన్ క్యాలండర్‌ను ఆవిష్కరించిన అహోబిల జీయర్ స్వామి



క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న రామానుజ అహోబిల జీయర్ స్వామి

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 18, ప్రభాత వార్త : శ్రీరంగం ఫౌండేషన ఆధ్వర్యంలో రూపొందించిన శోభకృత్ నామ సంవత్సర తెలుగు నూతన క్యాలండర్‌ను శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ అహోబిల జీయర్ స్వామి శనివారం ఆవిష్కరించారు. ముచ్చింతల్‌లోని జీవ ఆశ్రమంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ అహోబిల జీయర్ స్వామి వారి కరకమలముల చేత శ్రీరంగం ఫౌండేషన్ వారి శోభకృత్ నామ సంవత్సర రాశిఫలాలలో కూడిన తెలుగు నూతన క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పండుగ ఇది తెలుగు వారికి ఒక ప్రత్యేకమైన పండుగ అని, తెలుగు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని, తెలుగు రాష్ట్రాలలోని ప్రజలందరూ శోభకృత్ నామ సంవత్సరంలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు శ్రీరంగం ఫౌండేషన చైర్మన్ డా.సత్యంశ్రీరంగం, కోచైర్మన్ ఇందుమతి శ్రీరంగం, శ్రీరంగం సుమేద్, శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రవాణా కార్మికుల సంక్షేమానికై చర్యలు చేపట్టాలి

**సీఐటియూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్**



ధర్నాచౌక్, మార్చి 18, ప్రభాతవార్త: రవాణా కార్మికుల సంక్షేమానికై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కులో గత రెండు రోజులుగా ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌పోర్ట్ వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటుచేయాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మోటార్ వెహికల్ యాక్ట్ 2019 ని సవరించాలని డిమాండ్‌తో కొనసాగిస్తున్న నిరాహారదీక్షలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయటానికి ప్రభుత్వానికి ఉన్న ఆటంకం ఏమిటీ చెప్పాలని డిమాండ్ చేశారు. సమాజ గమనానికి కీలక పాత్ర పోషిస్తున్న రవాణా కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం ఏమిటని ప్రశ్నించారు. సీఐటియూ నగర అధ్యక్షులు జే.కుమారస్వామి మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు అన్ని రంగాల కార్మికులతో పాటు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆదాయాలు లేక ఇబ్బందులు పడుతున్న కార్మికులను చలాన్లు, పెనాల్టీల పేరుతో వేధిస్తున్నారని ఆరోపించారు. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ నగర కార్యదర్శి కే.అజయ్‌బాబు మాట్లాడుతూ దేశ జీడీపీలో నాలుగు శాతం వాటా అందిస్తున్న రవాణా రంగాన్ని ప్రభుత్వాలు అశ్రద్ధ చేయటం న్యాయం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్‌సీపీటీయూ రాష్ట్ర అధ్యక్షులు కే.సతీష్, తెలంగాణ ఆల్ డ్రైవర్స్ యూనియన్ సెక్రటరీ కిరణ్‌బాబు, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ నాయకులు ఎండీ కలీమ్, ఉమేష్ రెడ్డి, అహ్మద్‌ఖాన్, గౌస్, సురేష్, మహేష్, జునైద్, అర్బాస్ పాల్గొన్నారు.

## అన్ని రంగాలలో చురుకుగా పాల్గొంటున్న మహిళలు



కార్యక్రమంలో పాల్గొన్న ఎపి ప్రొడక్టివిటి కౌన్సిల్ ప్రిన్సిపాల్ డైరెక్టర్ డాక్టర్.శ్రీనివాస్ రఘు

యాకుత్‌పుర, మార్చి 18 ప్రభాతవార్త : మహిళలు అన్ని రంగాలలోను పాల్గొంటున్నారని ఎపి ప్రొడక్టివిటి కౌన్సిల్ ప్రిన్సిపాల్ డైరెక్టర్ డాక్టర్.టి.శ్రీనివాస్ రఘు అన్నారు. పాత బస్తీ యాకుత్‌పురలోని ఎస్ఆర్‌టి కాలనీలో శనివారం న్యూ హోప్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలోను చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు.మహిళలు తయారులు చేసిన పలు రకాల వస్తువులను 30 స్టాళ్లలో ప్రదర్శనగా ఏర్పాటు చేశారు.ఎపి ప్రొడక్ట్ విటి కౌన్సిల్ ప్రిన్సిపాల్ డైరెక్టర్.శ్రీనివాస్ రఘును శాలువ కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ప్రతినిధి నసీర్ సిద్దిఖీ,న్యూ హోప్ సంస్థ అధ్యక్షురాలు రెహానా బేగంతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సరైన పాలన లేకపోవడంతో నేటి టిఎస్‌పిఎస్సీలో ప్రశ్నాపత్రాల లీకేజి

సైఫాబాద్, మార్చి 18 ప్రభాతవార్త: రాష్ట్రంలో సరైన పాలన లేకపోవడం వల్లనే టిఎస్‌పిఎస్సీలో ప్రశ్నాపత్రాల లీకేజి జరిగిందని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే సిఎం కెసిఆర్ తన పదవికి రాజీనామా చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహమూద్‌ఆలీ డిమాండ్ చేశారు. టిఎస్‌పిఎస్సీని పునర్ వ్యవస్థీకరణ చేసి పాలనలో మార్పులు తీసుకురావాలని కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజానికి వెన్నుఎముకైన యువతను నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనబడుతున్నదని, రాష్ట్రంలో కాళేశ్వరం వాటర్ మాఫియా, డ్రగ్స్ మాఫియా, హాస్పటల్ మాఫియాతో గురించి ప్రజలు ఏం చేప్పాలని చూస్తున్నదని ప్రశ్నించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ద్వారానే ప్రజలకు నీతి నిజాయితీగల స్వచ్ఛమైన పాలన అందుతుందన్నారు. గ్రూప్-1, ఇతర ప్రశ్నాపత్రాలకు లీకేజిలకు బాధ్యులైన అధికారులను, ఉద్యోగులను తక్షణమే తొలగించాలన్నారు.

## ఏప్రిల్ 8న రన్ ఫర్ జీసస్




సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్ ఆనంద్, ఫీటర్

హైదరాబాద్, మార్చి 18, ప్రభాతవార్త: రాబోయే ఈస్టర్ పండగను పురస్కరించుకుని ఏప్రిల్ 8న రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బిషప్ సంజయ్ ఆనంద్ తెలిపారు. ఈమేరకు శనివారం దైవసేవకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీటింగ్‌కు హాజరై బ్రదర్ ఫీటర్‌తో కలిసి మాట్లాడారు. ఈస్టర్ ఆంటే పునరుద్దానపు శక్తి పొంది నూతన జీవితాన్ని మొదలు పెట్టడం అని తెలిపారు. పటాన్‌చెర్వు నుంచి చందానగర్ వరకు సాగే ఈస్టర్ ర్యాలీలో లక్షలాది మంది పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ దేవేందర్,బ్రదర్ భ్యాగరాజ్, బ్రదర్ జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి : జంపనప్రతాప్



నేతాజీ నగర్, కడక్‌పురాలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న జంపనప్రతాప్

అడ్డగుట్ట, మార్చి 18 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వారికి ఎల్లప్పుడు అండగా ఉంటూ నిరంతరం కృషి చేస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. ఇటీవల ప్రమాదానికి గురైన జంపనప్రతాప్ కుడి భుజానికి గాయమైన లెక్క చేయకుండా మహిళల యోగక్షేమాలు, ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు నేతాజీ నగర్,కడక్‌పురాలో పర్యటించి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుల్తానా, శకుంతల,షాలినీ, మౌలా, చోటూ, శశి పాల్గొన్నారు.

## రంజాన్ సందర్బంగా పాతబస్తీలో అన్ని వసతులు కల్పించాలి



నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీకి వినతి పత్రం అందజేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

చార్మినార్, మార్చి 18 ప్రభాతవార్త : రంజాన్ మాసం స ందర్భంగా హైదరాబాద్ పాతబస్తీలో అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతూ జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మీకి చార్మినార్ అసెంబ్లీ నియోజకర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ వినతి పత్రం అందజేశారు.పాతబస్తీలోని మసీదులతో పాటు అన్ని ప్రాంతాలలో సక్రమంగా పారిశుధ్య పనులు జరిగేలా, చీకటి లేకుండ వీధి దీపాలు వెలిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన నగర మేయర్ విజయలక్ష్మిని కోరారు. రంజాన్ మాసం సందర్భంగా పాతబస్తీలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని వసతులు కల్పిస్తామని మేయర్ గద్వాల విజయలక్ష్మి హామి ఇచ్చారని లోధీ తెలిపారు.ఈ కార్యమ్రంలో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంఛార్జి పుస్తె శ్రీకాంత్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



అబిడ్స్‌లోని నందిపబ్లిక్ స్కూల్‌లో జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ట్రాఫిక్ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీసు శంకర్ రాజ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థినీ, ఈ చిత్రంలో నందిని హైస్కూల్ చైర్మన్ ఎస్.నర్సింహులు, పాఠశాల ప్రిన్సిపల్ ప్రహర్ష, ఎస్.ప్రతిభ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# లిక్కర్ డాన్‌పై ఉన్న ప్రేమ.. నిరుద్యోగులపై లేదా..
# మంత్రుల నిర్వాకంపై కాంగ్రెస్‌నాయకులు ధ్వజం...


ఎల్‌బినగర్‌లో కాంగ్రెస్ నాయకుల నిరసన దీక్ష..

**మన్సూరాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** లిక్కర్ స్కాంలో కవితకు అండగా నిలిచిన మంత్రులు నిరుద్యోగ విద్యార్థులకు బాసటగా నిలవడంలో వైఫల్యం చెందారని కాంగ్రెస్ నాయకులు దుయ్యబట్టారు. ఎల్‌బినగర్ చౌరస్తాలో టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీక్‌లపై ఎల్‌బినగర్ కాంగ్రెస్ నాయకులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు

## ఎల్‌బినగర్‌లో పేపర్‌లీక్‌లపై నిరసన..

బల్మూరి వెంకట్, ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, ఎల్‌బినగర్ ఇంచార్జీ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిలు హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం లక్షలాదిమంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతుందని, టిఎస్‌పిఎస్‌సి పేపర్‌లీక్‌లో అవకతవకలకు పాల్పడిన నిందితులను వెలికి తీసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ లీకేజ్‌లపై సిబిఐతో విచారణ జరిపించాలని, నిరుద్యోగుల పక్షాల కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. విద్యార్థులు అధైర్యపడకుండా, స్వచ్ఛందంగా ముందుకువచ్చిన ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టాలన్నారు. టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ జానారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేశారు. పేపర్‌లీక్‌లపై ఇంత రాద్ధంతం జరుగుతున్న మంత్రులు ఎందుకు ముందుకు రావడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజ్జిభాస్కర్‌యాదవ్, కోట్ల శ్రీనివాస్, బుడ్డ సత్యనారాయణ, సుజాతరెడ్డి, రాజేశ్వరీ, తదితరులు పాల్గొన్నారు.

# వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీనివాస్‌గుప్త, శ్రీరామచంద్రమూర్తి తదితరులు

**సరూర్‌నగర్, మార్చి 18 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ దీన్‌దయాళ్‌నగర్ కాలనీ సమీపంలోని ఆర్‌సిఐ రోడ్డు పక్కన సర్వే నెంబర్ 124లో నూతనంగా నిర్మించనున్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన జరిగింది. బాలాపూర్ మండలంలోని వివిధ ఆర్యవైశ్య సంఘాల అభ్యర్థన మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి ఆర్‌సిఐ రోడ్డులో తన క్యాంపు కార్యాలయం పక్కనే హనుమాన్ దేవాలయానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని శ్రీ వాసవి మాత ఆలయ నిర్మాణానికి కేటాయించారు. ఈ నేపథ్యంలో శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కుటుంబాల సమక్షంలో శంకుస్థాపన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తేరెటిపల్లి శ్రీనివాస్‌గుప్త, ప్రధాన కార్యదర్శి పచ్చిపులుసు శ్రీరామచంద్రమూర్తిగుప్త, కోశాధికారి గందే వెంకటేశ్వర్లు గుప్త, సభ్యుల నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభఅధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణగుప్త, ఆర్య వైశ్యముఖ్యులు ఉప్పల శ్రీనివాస్‌గుప్త, మోగిలిపల్లి ఉపేందర్ గుప్త, రంగారెడ్డి జిల్లా మహాసభ అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశంగుప్త, అర్థం లక్ష్మయ్య, దీన్‌దయాల్‌నగర్ కాలనీ అధ్యక్షుడు గాజుల మధు, కోదూరు సోమేశ్వర్, జె.దామోదర్ రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# యువతిని మోసం చేసిన యువకుడికి రిమాండ్

**సైదాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమై యువతిని మోసం చేసిన నిందితుడిని మీర్‌పేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితురాలు సైదాబాద్‌లో విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేటకు చెందిన యువతి(28) బంజారాహిల్స్‌లోని ఒక ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తుంది. రెండేళ్ల క్రితం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అంబర్‌పేటకు చెందిన టెలికాం డిజైనర్ కళ్యాణ్ (29)తో పరిచయం ఏర్పడింది. దీన్ని ఆసరగా చేసుకుని గత ఏడాది యువతికి మాయమాటలు చెప్పి హోటల్‌కు తీసుకువెళ్లి కూల్ డ్రింక్‌లో మత్తుమందు కలిపి లైంగిక దాడికి పాల్పడ్డాడు. కాసేపటి తర్వాత స్పృహలోకి వచ్చిన యువతి జరిగిన విషయాన్ని గ్రహించి గట్టిగా నిలదీయడంతో పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమెతో సాన్నిహిత్యాన్ని కొనసాగించాడు. అంతేగాకుండా తన వద్ద నుంచి రూ.5లక్షల నగదు, ఆరు తులాల బంగారం తీసుకున్నట్లు, తన పేరుతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని వాడుకున్నట్లు బాధితురాలు పేర్కొంది. ఇదిలా ఉండగా కొద్ది నెలలుగా యువతితో కళ్యాణ్ మాట్లాడడం మానివేయడంతో అనుమానంవచ్చి వేడుకుంటూ తనను పెళ్లి చేసుకోమని అడిగింది. అయితే నేను పెళ్లి చేసుకోను, నా అలవాట్లు ఇలాగే ఉంటాయి, ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అని బెదిరింపులకు పాల్పడ్డాడని ఆమె వాపోయింది. అంతేగాకుండా పదిహేను రోజుల క్రితం కళ్యాణ్ కుటుంబ సభ్యులు తన ఇంటికి వచ్చి దుర్భాషలాడి బెదిరించారని, దీంతో తాను మీర్‌పేట పోలీసులను ఆశ్రయించడం జరిగిందని బాధితురాలు పేర్కొంది. కళ్యాణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఏవిఎన్‌రెడ్డి గెలుపు ద్వారా రానున్న రోజులు బిజెపివే: కొలన్ శంకర్‌రెడ్డి


సంబరాల్లో పాల్గొన్న కొలన్ శంకర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 18 ప్రభాతవార్త:** బిజెపి బలపరచిన మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవిఎన్‌రెడ్డి గెలుపు ద్వారా రానున్న రోజుల్లో బిజెపి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందనేది స్పష్టమవుతున్నదని రాష్ట్ర బిజెపి సీనియర్ నాయకుడు, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డి అన్నారు. ఏవిఎన్‌రెడ్డి గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బాలాపూర్ బొడ్రాయి వద్ద పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరిపి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా హాజరైన శంకర్‌రెడ్డి మాట్లాడుతూ బిజెపికి రానున్నవి ఇంకా మంచి రోజులన్నారు. ఈ ఎన్నిక ద్వారా రాష్ట్రంలో బిజెపి పుంజుకుంటుందనేది స్పష్టమవుతుందన్నారు. ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, మేధావులు, కార్మికులు, కర్షకులు బిజెపి వైపు మొగ్గు చూపుతున్నారనీ ఈ నేపథ్యంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దింటి సుధాకర్, మునగాల ప్రభాకర్‌రెడ్డి, కొంతం సంపత్‌రెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, సాంబ రవికుమార్, నరేష్, రామిడి శేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ముద్దం మధుసూదన్‌రెడ్డి, ఆలేటి శ్రీకాంత్, ఈశ్వరయ్య, మల్లేష్ లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డిసిఎం వ్యాన్ ఢీకొని లోకో పైలెట్ దుర్మరణం

**ఉప్పల్, మార్చి 18 ప్రభాతవార్త :** డిసిఎం వ్యాన్ ఢీకొని దక్షిణ మధ్య రైల్వేలో లోకో పైలెట్‌గా పనిచేస్తున్న ఒక యువకుడు దుర్మరణం చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని సనత్‌నగర్ డిపోలో లోకో పైలెట్‌గా పనిచేస్తున్న బాలకృష్ణ (34) ఘట్‌కేసర్‌లో నివాసం ఉంటున్నాడని తెలిపారు. అయితే అతనికి భార్య, ఒక బిడ్డ ఉందని తెలిపారు. కాగా శనివారం ఉదయం 3గంటల సమయంలో అతనికి సింహపురి ఖాళీ రేక్ డ్యూటి కేటాయించినట్లు సమాచారం అందింది. దీంతో తన యాక్టివా వాహనంలో ఇంటి నుంచి బయలుదేరి సికింద్రబాదాద్ వైపు వస్తున్నాడని తెలిపారు. ఇదే క్రమంలో ఉప్పల్ గాంధీ విగ్రహం వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన ఒక డిసిఎం వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలకు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, మార్చి 18 ప్రభాతవార్త :** కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి ఆదేశించారు. నాగోల్ డివిజన్ అయ్యప్ప కాలనీ చెరువులో జరుగుతున్న పూడికతీత పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ చెరువు మార్గంలో మట్టి బాగా పేరుకుపోవడం వల్ల ఇబ్బందులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీంతో చుట్టుపక్కల ఉన్న కాలనీల డ్రైనేజీ మురికినీరు రోడ్డు మీదకు పొంగిపొర్లుతున్నాయని తెలిపారు. ఓపెన్ డ్రైనేజీ మురికి నీరు బయటకు పోవడం లేదన్నారు. చెరువుముందు భాగంలో పేరుకుపోయిన మట్టిని తొలగించడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు, ఏఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# సైన్స్‌ఫేర్ ద్వారా విద్యార్థుల్లో మేధోశక్తి : కార్పొరేటర్ మీనా


సైన్స్ ఫేర్‌ను తిలకిస్తున్న కార్పొరేటర్ మీనా ఉపేందర్‌రెడ్డి

**నేరేడ్‌మెట్, మార్చి 18 ప్రభాతవార్త:** సైన్స్ ఫేర్ ద్వారా విద్యార్థుల్లో దాగివున్న మేధోశక్తిని వెలికితీయవచ్చని నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం డివిజన్‌పరిధిలోని జెజెనగర్ సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫేర్‌ను ఆమె సందర్శించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులు సాంకేతిక రంగం, క్రీడల్లో తమ సత్తాను చాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ టిఆర్ఎస్ ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, శివ, సుబ్బారాయుడు, మహేష్, రాజు, దినేష్, నవీన్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు


మినీ శిల్పారామంలో కళాకారుల నాట్య ప్రదర్శనలు

**ఉప్పల్, మార్చి 18 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం యంపీదియేటర్‌లో కల్పతరు మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ గురువు నిరంజన్ నాగరాజన్ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక కౌతం, పుష్పాంజలి, జనుత శబ్దం, రామాయణ శబ్దం, బైరవి వందన, జతిస్వరం రరవెను, ఇందరికి మంగళం అంశాలను ప్రదర్శించారు. జ్ఞానగాయత్రి శిష్య బృందంచే వందనం గిరి నంది, శరణు, శరణు, రామకోదండరామ, ఇదిగో భద్రాద్రి, కామాక్షి, స్వరజతి, సంగీత కచేరీలో పాటలు అలపించారు. వీరికి వయోలిన్‌పై మురళీధర్‌రావు, మ్రిదంగం సుసర్ణశర్మ సహకరించినట్లు తెలిపారు. శనివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని తెలిపారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యేలు


తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యేలు సుభాష్‌రెడ్డి, అరికెపూడి గాంధీ తదితరులు

**ఉప్పల్, మార్చి 18 ప్రభాతవార్త :** తిరుమల శ్రీవారిని శనివారం రాష్ట్ర మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యేలు బేతి సుభాష్ రెడ్డి, అరికెపూడి గాంధీలు దర్శించుకున్నారు. శనివారం ఉదయం విఐపి బ్రేక్ సమయంలో స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దయతో ఉప్పల్ నియోజకవర్గం ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామరావు, బిఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్.రాము తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 18 ప్రభాతవార్త:** తీవ్ర అనారోగ్యానికి గురైన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 9వ డివిజన్‌కు చెందిన కొండల్‌రెడ్డి అనే వ్యక్తి వైద్య చికిత్స నిమిత్తం మంజూరు చేయించిన రూ.49 వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శనివారం మంత్రి సబితా ఇంద్రారెడ్డి అందజేశారు. స్థానిక డివిజన్ బిఆర్ఎస్ ఇంచార్జి రామిడి నర్సిరెడ్డి కొండల్‌రెడ్డి విషయమై మంత్రి దృష్టికి తేగా స్పందించిన ఆమె సిఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో మంత్రి చేతుల మీదుగా చెక్కు తీసుకున్న కొండల్‌రెడ్డి ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దా పవన్‌కుమార్, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గౌతమ్‌నగర్ డివిజన్ సాయినగర్ చౌరస్తలో కార్పొరేటర్ మేకల సునీత రామూయాదవ్ బిఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు చిత్రంలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, రామూయాదవ్, ఉపేందర్‌రెడ్డి, అనిల్ కిషోర్, నాయకులు కార్యకర్తలు తదితరులు (ప్రభాతవార్త, మల్కాజిగిరి)

# ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమం : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి


నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, మార్చి 18 ప్రభాతవార్త :** మూసారాంబాగ్ డివిజన్‌లో ముమ్మరంగా ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని ఇంద్రనగర్ కమ్యూనిటీ హాల్‌లో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన, ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించడానికి ఆయుష్మాన్ భారత్ పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందు, శంకర్, భవాని, సంతోష్, మల్లేష్, తరుణి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.


పోలీసు, ప్రాసిక్యూషన్ అధికారుల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ పోలీస్ కమీషనర్ డి.ఎస్ చౌహాన్.. (ప్రభాతవార్త, నేరేడ్‌మెట్)

# మమ్మల్ని విస్మరిస్తే పార్టీ నష్టపోతుంది: కొత్త మనోహర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కొత్త మనోహర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 18 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో బిఆర్ఎస్‌పార్టీ అభివృద్ధిపై మంత్రి సబితాఇంద్రారెడ్డి దృష్టి సారించాలని నియోజకవర్గ పార్టీ మాజీ ఇంఛార్జి, సీనియర్ నాయకుడు కొత్త మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం సాయిరాంనగర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎలాంటి కార్యక్రమాలు జరిగినా మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డికి గానీ తనకు గానీ ఎలాంటి సమాచారం ఉండడం లేదనీ తమను విస్మరించడం వల్ల పార్టీ నష్టపోక తప్పదని ఆయన హెచ్చరించారు. నియోజకవర్గంలో పార్టీకి చెందిన అందరినీ కలుపుకొని పోతేనే వచ్చే ఎన్నికల్లో గెలుస్తామనీ లేని పక్షంలో ఓటమి తప్పదని ఆయన స్పష్టం చేశారు. ఇక పోతే నియోజకవర్గంలో దళిత బంధును పార్టీలో అర్హులైన పేద దళితులు, ఉద్యమకారులకు ఇవ్వాలనీ లేని పక్షంలో బాలాపూర్ చౌరస్తాలో ఆందోళన చేయాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. 2014వ సంవత్సరంలో టిఆర్ఎస్ గుర్తుపై ఎవరూ పోటీ చేయలేని పరిస్థితిలో ఉంటే తాను పోటీ చేసి 43 వేల ఓట్లు సాధించానని ఆయన గుర్తు చేశారు. ఈ సమావేశంలో సంతోష్ ముదిరాజ్, వేద భవాని, ఇంద్రపల్లి అశోక్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

# పైప్ లైన్ పనులకు నిధులు కేటాయించండి : బన్నాల గీత


జలమండలి ఎండి దానకిషోర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, మార్చి 18 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కొత్త మంచినీటి పైప్‌లైన్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ జలమండలి ఎండి దానకిషోర్‌ను కోరారు. ఈ మేరకు జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని శివాలయం, మల్లికార్జుననగర్, కుమ్మరికుంట, న్యూరాంనగర్, ధర్మపురికాలనీ, ప్రశాంతినగర్ తదితరప్రాంతాల్లో కొత్త మంచినీటి పెప్‌లైన్లు వేయాల్సి ఉందని, పురాతన పైప్‌లైన్ల కారణంగా ఇబ్బందులు వస్తున్నాయని, వాటి స్థానంలో కొత్త పైప్‌లైన్లు వేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. దీనిపై జలమండలి ఎండి దానకిషోర్ స్పందిస్తూ త్వరలోనే నిధులు కేటాయించి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ గుర్తింపు కార్డులు తీసుకోవాలి: అమరేందర్‌రెడ్డి


ఓటర్ నమోదు శిబిరాన్ని ప్రారంభించిన అమరేందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 18 ప్రభాతవార్త:** ఓటు హక్కు ఉన్నప్పటికీ ఓటర్ గుర్తింపు కార్డులు లేని వారు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి కోరారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ ఆర్చిడ్ కాలనీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటర్ నమోదు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై ఓటర్ గుర్తింపు కార్డును తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేస్తున్న శిబిరాలను అర్హులైన వారు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అహ్మద్ బామ్, పోషియా, అబ్దుల్లా బసావి, వంగేటి మధుసూదన్‌రెడ్డి, ఆంజనేయులు ముదిరాజ్, సాయిగౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# టిఎస్‌పిఎస్‌సి చైర్మన్‌ను సస్పెండ్ చేయాలి : రామ్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మార్చి 18 ప్రభాతవార్త :** టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ జనార్దన్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి డిమాండ్ చేశారు. టిఎస్‌పిఎస్‌సి పేపర్‌తోపాటు మరో మూడు పేపర్లు పూర్తిగా ప్రభుత్వ అసమర్థతే అని దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కెసిఆర్ వెంటనే రాజీనామా చేయాలని, లక్షలాదిమంది నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతుందని మండిపడ్డారు. కెసిఆర్ కూతురు లిక్కర్ స్కాంలో విచారణకు వెళ్తే ప్రెస్‌మీట్‌లు పెట్టిన మంత్రులు పేపర్ లీకేజీలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకుంటే కేటీఆర్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులు నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీపాల్, లింగాల కిషోర్ గౌడ్, కుట్ల నర్సింహా యాదవ్, మంజులత, బండ సురేందర్, జైపాల్, భాను, గోపి, నారాయణ, అరుణ్, మతంగియాదగిరి పాల్గొన్నారు.

# మెడిసిన్ చదువుకి బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం


ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న బండారి లక్ష్మారెడ్డి

**తార్నాక, మార్చి 18 ప్రభాతవార్త :** చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రిపురం కాలనీకి చెందిన పెరవు నర్సింహం – దేవమని దంపతుల కుమారుడు ప్రశాంత్ మెడిసిన్‌లో స్టేట్ 69వ ర్యాంక్‌తో ఉస్మానియా మెడికల్ కాలేజీలో సీటు సాధించడం జరిగింది. మెడిసిన్ చదువు చదివే స్తోమత లేక ఇబ్బంది పెడుతున్న విషయం తెలుసుకున్న బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మెడిసిన్ సీటు సాధించిన వారికి 5సంవత్సరాలకయ్యే ఫీజు మొత్తం తామే చెల్లిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్, బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేష్‌గౌడ్ చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అడ్మిన్ ఎంపల్లి పద్మారెడ్డి, చర్లపల్లి డివిజన్ పరిధిలోని కాలనీల అధ్యక్ష కార్యదర్శులు మొగిలి రాఘవరెడ్డి, సురేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కొలను రామచంద్రారెడ్డి, శ్రీకాంత్, మహేందర్, పంజాల శ్రీనివాస్‌గౌడ్, జగన్ నాయక్, కృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రాలు ప్రజల దాహార్తిని తీరుస్తాయి : శ్రీనివాస్‌రెడ్డి


శాలివాహననగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పున్‌రెడ్డి కృష్ణారెడ్డి తదితరులు

**మలక్‌పేట, మార్చి 18 ప్రభాతవార్త :** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదపడతాయని మూసారాంబాగ్ డివిజన్ లక్ష్మీనగర్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రముఖ సంఘ సేవకుడు పున్‌రెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శాలివాహన నగర్ బతుకమ్మ క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి సేవ చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులు పున్‌రెడ్డి కృష్ణారెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో దేవిడి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు-తల్లిదండ్రుల సమావేశం


బహుమతులు అందజేస్తున్న ఎఎస్‌పిడి రమేష్, ఎంఇవో కృష్ణ

**సైదాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** చంపాపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు-తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎ.ఎస్.పి.డి గాజర్ల రమేష్, సరూర్‌నగర్ మండలం ఎంఇవో ఆదర్ల కృష్ణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఒకటవ తరగతి విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రుల సమక్షంలో పరిశీలించి, ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, పాఠశాల పనితీరు గురించి విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఎస్ఎన్‌కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ప్రదర్శనపై వారు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాలకు కావాల్సిన సదుపాయాలను కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంచిరెడ్డి అనంతరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఏవిఎన్‌రెడ్డి గెలుపు తెలంగాణాలో మార్పుకు నాంది: హరిగౌడ్


ఏవిఎన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న హరిగౌడ్

**సైదాబాద్, మార్చి 18 ప్రభాతవార్త:** హైద్రాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయం సాధించిన ఏవిఎన్‌రెడ్డికి బిజెపి ఓబిసి మోర్చా మీడియ అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హరిగౌడ్ విలేకరులతో మాట్లాడుతూ టీచర్ ఎమ్మెల్సీగా బిజెపి బలపర్చిన ఏవిఎన్‌రెడ్డి గెలవడం తెలంగాణా ప్రజల అభిప్రాయాలకు అద్దం పడుతుందన్నారు. రాబోయే శాసన సభ ఎన్నికల్లో కూడా రాష్ట్రంలో బిజెపి విజయదుందుబి మోగించడం ఖాయమన్నారు. తెలంగాణా ప్రజలు మార్పును కోరుకుంటున్నారనడానికి ఏవిఎన్‌రెడ్డి గెలుపే నిదర్శనమని అన్నారు.


తెలంగాణ తెలుగుదేశం రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని మల్కాజ్‌గిరి అసెంబ్లి నియోజకవర్గానికి చెందిన జిల్లా శంకర్, సి.సంతోష్‌సాగర్, సి.నరేష్‌ముదిరాజ్‌లను కో ఆర్డినేటర్లుగా నియమించి వారికి నియామక పత్రాలను అందజేసిన దృశ్యం (ప్రభాతవార్త, మల్కాజిగిరి)